# పుస్తకం

''నేనిచ్చిన పుస్తకం చదివావా వాణీ?''

''చదివాను చాలా థ్రిల్లింగా గ్రిప్పింగా వున్నది శారూ''.

'' ఊరికే తుదీ మొదలు, మధ్యపుటలూ చదివావేమో''.

''లేదు లేదు. పేజ్ బై పేజ్ వర్డ్ బై వర్డ్ చదివాను''

''యెక్కడడిగినా చెప్పగలవూ?''

''అడిగి చూడు వాణీ''.

''వాఖ్యానం చేతా?''

''అఫ్‌కోర్స్ శారదాంబా. చేతా. ఫిల్మ్ లోనే అక్కడే వ్యాఖ్యానిస్తూ తిట్లూ తిన్నాను. మెప్పూ పొందాను''.

'' ఒక్కొక్క పాత్ర మీద క్లుప్తంగా చెప్పగలవూ?''

''చెప్పగలను శారదాంబ గారూ'' వాణీ నవ్వింది.

''చూతాం. హీరో యెట్టివాడూ?''

'' ఆశయాలు మంచివే. తొక్కిన మార్గం ముళ్ల బాట. గులాబి రేకులు చల్లిన త్రోవగాదు. ఆకతాయితనం మితి మీరింది. పక్షపాతమున్నది. విద్యా వైద్యాలను గౌరవించినట్లు తక్కిన వాటిని గౌరవించడు. గొప్పవాళ్ల ననుకరిస్తూ తానూ అట్టివాడనే అనుకుంటాడు'' అంటున్నది వాణి.

''యెట్టి వాడననుకుంటాడూ తెలుపుము''.

''షా, చాప్లిన్, హిగ్గిన్స్, కపూర్ ఎట్ సెటిరా. క్లౌన్ అన్నా విదూషకుడన్నా సరిపోతుంది. ఆనెస్టే. కాని అన్ని విషయాలలోనూ గాదు. కృష్ణపరమాత్మ చెప్పినట్టు గెలుపే ముఖ్యం. మేనత్త కుంతికి తెలియజెప్పాడా పాయింట్''.

''వుండూ. ఎక్స్‌ప్రెస్‌లాగా వెళ్తున్నావు''.

'సరే. నాదేం పోయిందీ. సంశయాలున్నాయాయేం?''

''అసలు సంఘవిరుద్ధమైన పంథా యెందుకు పురుగులాగా తలలో దూరి

తొలిచిందీ?''

''నవ్వుతాలుగా చెప్పాలంటే పేరు ప్రఖ్యాతీ తెచ్చుకోవాలని. యెలాగంటే తండ్రికి పేరు తేవాలనే ఐడియాతో ఒకబ్బాయి చెరువుగట్టున నిలబడి నీళ్లపట్టుకెళ్లే స్త్రీల కుండల మీద గురిచూసి గోలీలు విసిరాడట. చిల్లి బడి నీళ్ల కారిపోతే స్త్రీలు ''యెవరబ్బాయి?'' అని అడిగి తెలుసుకుంటే తండ్రిపేరు పైకొచ్చిందట''.

శారూ నవ్వింది ''చమత్కారంగా చెప్పావు?'' అన్నది.

''నువ్వు సంఘాన్ని స్టడీ చేయలేదనుకుంటా శారూ''.

''చాలా మంది సంఘజీవులు వాపోతారు'' అన్నది వాణి.

''యేమని వాపోతారూ?''

''యీ సంఘ మర్యాదలూ, ఆనవాయితీలూ, రిచువల్సూ ఆచారాలతోనే యీ కాడికొచ్చాం. ఆరునిట్టాళ్ల పెంకుటిల్లు పోయి పూరిపాకలో కొచ్చాం. మాగాని పోయి రెక్కాడితే గాని డొక్కాడని స్థితికొచ్చాం''.

''కొన్ని చెప్పు వింటా యింటరెస్టింగ్‌గా వున్నది''.

''వినగలిగితే విను. మండలానికో రివాజూ, ఆచారమూ ఆనవాయితీలుంటాయి. కృష్ణా మండలం తీసుకో. ఇంటి ఆడపడుచుకి ప్రతియేడూ పసుపుకుంకం కింద కొంత సొమ్మివ్వాలి. కూతురూ అల్లుడూ పీటలమీద కూచున్నప్పుడల్లా కొత్త బట్టలు పెట్టాలి. పండగలకు రమ్మని టియె ఇవ్వాలి. కట్నం, కానుకలు, సారె, అంపకాల బట్టలూ, సత్యనారాయణ వ్రతం నాడు మళ్లా నూతన వస్త్రాలూ, మూణ్ణిద్దర్లూ, పదహారో జులపండగ కాక విడిది యిచ్చిన వారికీ బట్టలు పెట్టాలి. నేనింకా వివరంగా చెప్పలేదు. కాళ్లకూరి నారాయణరావు అనే నాటక రచయిత దోపిడీ అని అర్థమొచ్చేట్టు వరవిక్రయంలో పెళ్లి తంతు చిత్రించారు. కూతురు గర్భవతి అయితే పసుపు కుంకుమ యిచ్చి, బేసి నెలల్లోనే తేవాలి. తరవాత బారసాల యింకా వేడుకలున్నాయి''.

''అవీ వింటాను వాణీ. మా కన్ని లేవు'' అన్నది శారు.

''పిల్లను తొట్టిలో వుంచటం, తల్లిచేత నూతులో చేద వేయించి

నూతిపోతరాజును పూజించటం, ఊ అంటే వుగ్గు గిన్నెలు పంచాలి. అడుగుల కరిశలు, అన్నప్రాశన'' అంటున్నది వాణి.

''స్త్రీ సంపర్కమే మానేయమనచ్చునే పురుగూ?'' అన్నదెటో చూస్తూ శారదా విక్టోరియా జేమ్సు.

'పురుగు అనే వుండచ్చు శారూ. కాని ఇనుప కచ్చడం కట్టుకుని సీజరు భార్యననుకరిస్తే జబ్బుపడసాగాడు హీరో. మరో ఉప్పెన తుంట వింటి వాని బాణాలు గుచ్చుకున్నాయి పాపం హీరోకి. బురిడీ వేసి, ఆశపెట్టి, గప్పాలు గొట్టీ సంపర్కం ఈజీ చేసుకున్నాడు''.

''యెన్ని చేసినా ప్రమాదిస్తుందే సంపర్కం? తుంట వింటివానికెన్ని బాణాలు? అవేమిటే? మీ మైథాలజీ రోమాన్సెక్కువ. ఔనా. తుంట వింటివాడంటే క్యూపిడేనా?'' అనడిగింది.

''కరెక్టే. అయిదు బాణాలు వాటి చివర పూలుంటాయి. అరవింద మశోకంచ చూతంచ నవమల్లికా, నీలోత్పలం. విల్లేమో చెరకు గడ. నారి తుమ్మెదల బారు''.

శారు చప్పట్లు గొట్టి నవ్వింది ''వండర్‌ఫుల్ కానీ, కానీ''.

''ప్రమాదిస్తుందని తెలిసే, పథకం వేసే వుంచాడు నావెల్లో హీరో. ఎబార్షనిస్టుని హాండీగా వుంచాడు. దాచేందుకు బొక్కలూ చూశాడు. బురిడీ వేయించుకున్నామె తానే బొక్కలో వుంటే మరీ మంచిదీ. బాడీ గార్డుని పెట్టక్కర్లా''.

'పెద్ద మనిషి గదూ హీరో. పురుగెలా తొలవగలదూ?''

''కాదు గనకనే తొలవగలిగింది. ఆస్తిలో వాటా తీసుకోరాదని మనస్సులో అంతరాత్మ యెదుట భీష్మ ప్రతిజ్ఞ చేసుకున్నాడు. పతాభి అనే భావుకుడు, పబ్లిగ్గా ఆస్తిహక్కు వదులుకుని, మరో మతస్థురాలిని పెళ్లాడి జెంటిల్‌మాన్ అనిపించుకున్నాడు. మైథాలజీలో దాశరాజు ''రాజ్యం నీది. రేపు నీ పిల్లలు దావా వేయచ్చు'' అనగానే దేవవ్రతుడనే భీష్ముడు 'పెళ్లి చేసుకోను'' అని మళ్లా బొబ్బ

పెట్టాడు. సరీగ్గా అలాగే చేశాడీ అభినవ భీష్మ''.

''యెన్ని చేసినా ఘజనీ ఘోరీ దండయాత్రలుంటాయే. అయిన వారూ పరాయిా వస్తారే. వదలరే''.

''వదలలేదు, శారూ. తన నవవిధాన్‌ని ఎనామెల్ పూత పూసి లతలు తీగలూ, లేళ్లూ కుందేళ్లూ వేసి, ఆశువుగా అబద్ధాలాడు. దండయాత్రలను యెంజాయ్ చేశాడు''.

''నమ్మితారూ? ఫూల్సు గాదే'' అనడిగింది శారూ.

''నమ్మలేదు. అసలు తంతుతలాయించాడని తేల్చారు''

''నవవిధాన్ అన్నావేం''.

''ఫిమేల్ని బురిడీ వేసి చదివించి, వర్కింగ్ వుమన్‌గా మార్చి గుప్పెట్లో పెట్టుకోటం నవవిధాన్. మాన్ ప్రపోజెస్ గాడ్ డిస్పోజెస్ అని ప్రావెర్బ్. కూనా గురుజూ చేరితే వారి గతీ యింతే. సంఘాన్నెదిరించి గ్రాడ్యుయేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్, విలాయితీ వెళ్లే అవకాశాలూ అందిస్తాడు. రీచువల్సు పాటించవద్దని కట్టడి చేస్తాడు. ఇల్లీగల్ కూనలూ గురుజులూ దావాలాడే ఛాన్సె వుండదు. అదీ గడుస్తనం''.

'' ఆ గాడుస్తనం అప్లై చేసి దండయాత్రలాపచ్చునే?'' అనడిగింది శారూ.

''కడగ్గా పోయే శనేశ్వరమా. కాలిమీదుగా పో అన్నట్లు తానే ఆహ్వానించాడేమో గడసరి'' అన్నది కసిగా మొరటుగా.

''దాన్నీ సమర్థించుకున్నాడు హీరో. అది మానవత అన్నాడు. మానవ హక్కుల పరిరక్షణ అన్నాడు పొలిటీషనై''.

'' ఆరొగెంటేమో! గాడొకడున్నాడని మరిచి చెలగాట మాడాడేమో'' అన్నది శారూ ఆలోచిస్తూ.

''అనుమానమేల డియర్ శారూ? నేనంత దూరం ఆలోచించను అనే పడికట్టురాయిలాటి మాట నేర్చాడు''. శారూ టాపిక్ మార్చి ''నావెల్, నవల అని యెందుకంటారు'' అనడిగింది.

''బొక్కాషియెూ అనే రచయిత కథలు వ్రాసి వాటిని తెలివిగా చమత్కారంగా అతికించి, మొత్తం రచనను నావెల్ అనెను. గుణాఢ్యుని బృహత్కథ అలాటిదే''.

''వడ్డించే వాడు మనవాడైతే అనే సామెత వున్నది. గడుసరి వేపు వారు పేట్రేగితే'' అంటున్నది శారూ.

'పేట్రేగేదాకా యెక్కడా, హీరో గారు వారికి ప్రత్యుద్ధానం చేయించి, బ్రహ్మరథం పట్టించి, వూడిగం చేయించి అడుగులకు మడుగులొత్తింపించాడు తన ప్రేయసి చేత. పొగడక తెగనాడుతారా? తన నవ విధానాన్ని వారు మెచ్చాలనే గడుగ్గాయి ఐడియా. కొంతమంది డాక్టరు రోగుల్ని, వారి కంప్లెయింట్సు వింటూ యంత్రాల్ని చూస్తున్నట్టు చూస్తూ ''యెక్కడ పాడైందీ, యెక్కడ యెలా రిపేర్ చేస్తే మళ్లా సాఫీగా రన్నవుతుందీ'' అని చూస్తారట అలాగా దీని చేత పనిచేయించి ఖ్యాతి నాకు దక్కేట్టు చేయటమెలా? అని బుర్ర వుపయోగిస్తాడు'' అన్నది వాణి.

శారూ నవ్వి, ''పిల్లి గుడ్డిదైతే ఎలుక చెలగాటమాడుతుందిట దానితో. స్త్రీకి పురుగుతత్త్వం అర్థంగాలేదేమెూ. తనను పురుగులాగా చూస్తున్నాడనుకోలేదేమో పోనిద్దాం వాణీ. ఆలెండ్స్ వెల్ దటెండ్స్ వెల్ అన్నట్లు కొసాకు గెలుచుకెళ్లాడూ?'' అనడిగింది.

''నువే అన్నావుగా చెలగాటమని, ఎండింగ్ కింగ్‌లియర్ పరిస్థితి లాగా అయింది. షేక్స్పియరే'' మనుషులు పొరపాట్లు తప్పులూ చేసి చివరికి వచ్చిన దుష్ఫలితాల్ని భరించలేక, తట్టుకోలేక, తుఫానులో చిక్కుకుని, కళ్లకు చేతులడ్డముంచుకుంటారు'' అన్నాడు హీరో తన వారి సైకాలజీకే తట్టుకోలేక వ్యథల పాలైనాడు కొసన.

''ఆనెస్టీ యీజ్‌ది బెస్ట్ పాలసీ అని ఆచరిస్తారు కొంతమంది హీరోలు. బి ఆనెస్ట్ విత్ యువర్ సెల్ఫ్ అనీ అన్నారూ. హీరో డిజానెస్ట్ కాకూడదే. అయితే విలన్ అంటారతన్ని''.

''ప్రతీ నావెల్లో విలన్‌కి శిక్షపడక్కర్లేదు. ప్రతీ రచనలోనూ నీతి చెప్పక్కరలే

దు. జివాగో నవల రాసిన లూయిస్ పాశ్చర్ నావెల్‌కి సాహిత్యానికి నోబెల్ బహుమానం వచ్చిందే''.

''నువ్వు మనుషుల్ని పుస్తకం చదివినట్టు స్టడీ చేస్తావు వాణీ. అందుకే అందంగా క్రిటిసైజ్ చేయగలవు. క్రిటిసిజం వేరు. తిట్టటం వేరు. నేనూ యిహ స్టడీ చేస్తా'' అన్నది శారూ.

'' ఒకే శారూ. నలుడు చూడు, పాముని మంటల్లోంచి కాపాడితే అది కాటు వేసి వికృతరూపుని చేసినా దానిని తిట్టలేదు. పాము చెప్పిన దాన్ని నమ్మి రోజులు నెట్టు కెళ్లాడు. గమ్యం చేరాడు. గెలిచాడు'' అన్నది వాణి.